www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 18 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## భాస్కర్ సేవలు నిత్య స్మరణీయం



-ఆశయసాధనకు పునరంకితమవుదాం
- సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం
- ఘనంగా దండి భాస్కర్ పదో వర్ధంతి

2లో..

## పెద్ద వాగు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి

-నేటి పాదయాత్ర భవిష్యత్ పోరాటాలకు పునాది
-పునర్మిర్మాణానికి రూ.500కోట్లు కేటాయించాలి
-ప్రభుత్వాలకు పోరాటాలతో బుద్ధి చెబుదాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట పెద్దవాగు ప్రాజెక్టు పునర్మిర్మాణానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని, పెద్ద వాగు పునర్మిర్మాణానికి రూ.500కోట్లు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో గల పెద్దవాగు ప్రాజెక్టు నుండి

మిగతా 2లో..

## 22 నుంచి ఆర్టిసిలో సమ్మె



-సమ్మెపై విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టిసి)ఈ నెల 22 నుంచి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసి ఆధ్వర్యంలో సమ్మె తలపెట్టినట్లు జేఏసి రాష్ట్ర నాయకులు పాటి అప్పారావు తెలిపారు. 31 డిమాండ్లతో ఈనెల 13న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని లేబర్ కమిషన్ ఎదుట

మిగతా 2లో..

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



3లో..



# భాస్కర్ సేవలు నిత్య స్మరణీయం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ దండి భాస్కర్ సేవలు నిత్య స్మరణీయమని జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆయన ఆశయసాధనకు పునరంకితమై పనిచేయడమే ఆయనకిచ్చే సరైన నివాళి అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో గల ఆయన స్మారకస్థూపం వద్ద పదర వర్థంతి వేడులను ఘనంగా నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎర్రబాబు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ...దండి భాస్కర్ ఎంతో ధైర్యశాలి అని, ఎంతటి విపత్తు వచ్చినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని అన్నారు. ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. జర్నలిస్టుగా కూడా భాస్కర్ ప్రజల గొంతుకగా పనిచేస్తూ అధికారులను తన ప్రశ్నించేరాతలతో మేల్కొల్పేవారని తెలిపారు. దళితులు, బడుగుబలహీనవర్గాల పక్షాన భాస్కర్ ఓ వేగుచుక్కలా, నోటిలో నాలుకలా ఉండేవారని అన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా భాస్కర్ అన్నకు చెప్పుకోవాలి అనే స్థాయిలో ప్రజల నమ్మకాన్ని పొందిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను సాధించినప్పుడే మనం అర్పించే నిజమైన ఘన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్(అన్నయ్య), సిపిఐ నగర కార్యదర్శి జానీమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాది సాంబశివరెడ్డి, మేకల శ్రీనివాసరావు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, పగడాల మల్లేష్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మోహన్‌రావు, ఉన్నం రంగారావు, యడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, ఐఏఎల్ జాతీయ సమతి సభ్యుడు ఓరుగంటి శేషగిరి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మహిళా సంఘం జిల్లా నాయకురాల్లు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, ప్రజాపక్షం దినపత్రిక ఉమ్మడి ఖమ్మం జిల్లా బూరో ఇంచార్జ్ ఏనుగు వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, ఖమ్మంరూరల్ మండల విలేకరులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, ఉపేందర్, రంగారావు, లక్మ్మారెడ్డి, లక్ష్మ ణ్, నాగరాజు, అశోక్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# పెద్ద వాగు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి






(మొదటిపేజీ తరువాయి)

వేలేరుపాడు మండల తహశీల్దార్ కార్యాలయం వరకు 21కి.మీ పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను పెద్దవాగు ప్రాజెక్టు వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ చైతన్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, స్థానిక జిల్లాభయ రాష్ట్రాల సిపిఐ బృందం పెద్ద వాగు పాజెక్టు పునర్మిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ అగ్రభాగాన నిలిచి పాదయాత్రలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆద్యంతం పాదయాత్ర కొనసాగించారు. ఈసందర్భంగా గుజ్జుల ఈశ్వర్యయ్య మాట్లాడుతూ వేలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నా వేలాది కుటుంబాలు దాహానికి అల్లాడిపోతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నేరపూరిత నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం 1970లో సిపిఐ పోరాటాలు ఆందోళనలు సాగించిన నేపథ్యంలో 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో 20వేల ఎకరాల భూమికి సాగునీరు, 30 గ్రామాలకు తాగునీరు అందిస్తూ ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీరుస్తుందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 7 మండలాలు ఆంధ్ర రాష్ట్రంలో కలుపుకున్న పాలకులకు వారి బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత లేదా అని ఈశ్వరయ్య ప్రశ్నించారు. 2024 జూలైలో ఊహించని వరద రావడంతో గట్లు తెగి గండి పడిందన్నారు. వేలాది మంది ప్రజలు రైతులు నిరాశ్రయులు అయ్యారని, అప్పటి నుండి ప్రజలు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతూ రెండు సంవత్సరాలుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఈప్రాంత ప్రజలు, గిరిజన కుటుంబాలు పెద్దవాగు ప్రాజెక్టుపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ వేలాది మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపిస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి ప్రాజెక్టు ఆవశ్యకత తెలిసి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పట్టెడన్నం పెట్టే ప్రాజెక్టునుంచి చుక్కనీరు రాక ఈ ప్రాంతంలో వేరే పని లేక మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ ప్రాజెక్టులు నిర్మాణానికి వేల కోట్లు కేటాయిస్తున్నానని కల్లబొల్లి కబర్లు చెబుతున్నారని, పెద్దవాగు ప్రాజెక్టు పునర్మిర్మాణంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. 2024లో ప్రాజెక్టు గండిపడి పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. అయితే నేటికి పూర్తిస్థాయిలో పునర్మిర్మాణానికి ప్రయత్నించకపోవడం దుర్మార్గం అన్నారు. అధిక ఆయకట్టు కలిగిన ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి తక్షణం సమస్యను పరిష్కరించాలన్నారు. జీవనాధారం కోల్పోయి ఆంధ్రాలోని వేల కుటుంబాలు రోడ్డున పడకముందే ప్రాజెక్టును పునర్మిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు వరమని తెలిపారు. ప్రాజెక్టులో సీల్ట్ తీయని కారణంగా 2024 జూలైలో ప్రాజెక్టుకు గండిపడి ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం చేకూరిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 3.50కోట్లతో మరమ్మతులకు ఖర్చుచేసి చేతులు దులుపుకుందన్నారు. అయితే తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు పునర్మిర్మాణం చేయడంతో పాటు నష్టపోయిన బాధితులకు పరిహారం ఇవ్వాలని లేకుంటే భవిష్యత్‌లో తమ పోరాటాల ద్వారా ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం వేలేరుపాడు తహశీల్దార్ ఉదయ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వేలేరుపాడు, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, ద్వారక తిరుమల మండలాల కార్యదర్శులు బాడిశ రాము, కొన్నే లక్ష్మయ్యయ్య, జంపన వెంకటరమణరాజు, గోలిమే బాలేసు, జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబురావు, సన్నేపల్లి సాయిబాబా, బేతి కిషర్, కొప్పుల నాగరాజు, అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సలీం, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, జిల్లా ఎఐటియుసి నర్రాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 22 నుంచి ఆర్టిసిలో సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యం చర్చలకు రాలేదని ఆయన తెలిపారు. శుక్రవారం టిజిఎస్‌ఆర్టిసి జేఏసి పిలుపు మేరకు ఖమ్మం డిపో జేఏసి ఆధ్వర్యంలో సమ్మెకు సన్నాహకంగా గేట్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల వల్ల హైదరాబాద్, సికింద్రబాద్ రీజియన్లలో డ్రైవర్లను బదిలీ చేస్తున్నారని ఆ బదిలీలను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. 32 డిమాండ్ల సాధనకు జేఏసి పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ఆర్టిసి స్థలాలను ప్రైవేటు సంస్థకు దారాదత్తం చేయడాన్ని వెంటనే నిలిపి వేయాలని అప్పారావు డిమాండ్ చేశారు. అన్ని కేటగిరీల ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రతను ప్రకటించాలని 2021, 2025 వేతన సవరణ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయడం కోసం ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల కార్మికులు సిద్దంగా ఉండాలని సమ్మె నోటీసు ఇవ్వని కార్మిక సంఘాలు కూడా సమ్మెను బలపర్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ జేఏసి నాయకులు ఎల్‌ఆర్‌కె రావు, కోటయ్య, బొల్లికొండ వెంకన్న, బూసిరెడ్డి వెంకటరెడ్డి, డిపో జేఏసి ఛైర్మన్ బేతంపూడి బుచ్చిబాబు, జగన్, ఎంఎం రావు, కెకె కుమార్, కవిత, ఆదిలక్ష్మి, రాధ, నాగమణి, చలపతిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులతో చర్చలు సఫలం

### - మే ఒకటి నుంచి పెరిగిన వేతనాల అమలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** నిర్మాణ రంగ కార్మికుల కూలీ రేట్ల పెంపు విషయంలో అటు యజమాన్యాలు, ఇటు కార్మికుల మధ్య కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన చర్యలు పలప్రదమయ్యాయి. కొద్ది రోజులుగా సుతారి కూలీ ధరల పెంపు విషయంలో చర్చలు సాగుతున్నాయి. కొందరు కరపత్రాలు వేసి నిర్మాణ ప్రాంతాల్లో జోక్యం చేసుకుని అంతరాయంకలిగిస్తుండడంతో గుర్తింపు సంఘాలైన ఏఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, టియుసిఐ, ఇండిపెండెంట్ యూనియన్ సహా ఏడు సంఘాల ప్రతినిధులతో కార్మిక శాఖ ఉప కమిషనర్ కె. విజయ్ భాస్కర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం చర్చలు జరిపారు. బిల్డర్స్ ప్రతినిధులు, యూనియన్ ప్రతినిధుల సమక్షంలో పలు దఫాలు చర్చించిన తర్వాత ప్రస్తుత ధరలకు అనుగుణంగా 10 శాతం కూలీ రేట్లను పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం మేస్త్రీకి రూ.950 ఉండగా దానిని రూ.1050కు సహాయ కార్మికులకు రూ.670 నుంచి రూ.730లకు పెంచాలని సవరించిన రేట్లు మే ఒకటి నుంచి అమలులోకి వస్తాయని విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రతి కార్మికుడు కూలీకి తగినట్లుగా ఎనిమిది గంటలు పనిచేయాలని కార్మిక శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులు తప్పని సరిగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మినిట్స్‌లో పొందుపర్చారు. ఆడ, మగ కూలీ విషయంలో తేడాలు పాటించరాదని సమాన పనికి సమాన వేతనం ఖచ్చితంగా అమలు చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని విజయ్ భాస్కర్‌రెడ్డి కార్మిక, బిల్డర్ ప్రతినిధులకు సూచించారు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సమావేశం నిర్ణయించింది.

## గోల్డెన్ అవర్‌పై అవగాహన అవసరం




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రోడ్డు ప్రమాదం సంభవించిన ప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే క్రమంలో మెదటి గంట సమయం గోల్డెన్ ఆవర్ అని దీనిపై అంద రూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసు లు అన్నారు. అరైవ్‌అలైవ్ లో భాగంగా శుక్రవారం టూ టౌన్ సిఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, విద్యార్థులకు గోల్డన్ ఆవర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపి మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించేలోపు క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు చేపట్టవలసిన సిపిఆర్, ప్రథమ చికిత్స, అత్యవసరకాల్స్, పిఎం రహత నగదు ప్రోత్సహం, సామాజిక బాధ్యత, గోల్డెన్ అవర్‌రెస్పాన్స్ టైమ్ మొదలన విషయాలను వారికి వివరించారు. ప్రమాదం నుండి బాధితుడిని కాపాడిన వారికి ప్రభుత్వం 25 వేల రూపాయల నగదు, ప్రశంసా పత్రాన్ని ప్రోత్సహకంగా అందిస్తుందని తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో బాధితులను కాపాడేలా ప్రజలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, టూటౌన్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిపై పిడియాక్ట్ అమలు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని దారిమళ్లించి దుర్వినియోగం చేస్తున్న వ్యక్తిపై పిడి యాక్ట్ నమోదు చేసి అమలు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం నగరానికి చెందిన ఆత్మకూరి జగదీష్ పేదల దగ్గర తక్కువ ధరకు రేషన్ బియ్యం కోనుగోలు చేసి బయటి రాష్ట్రాలకు తరలిస్తూ అనేక పర్యాయాలు పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. ఇతనిపై ఖమ్మం జిల్లాలో 13 కేసులు ఉండగా సూర్యపేట, వరంగల్ జిల్లాల్లో రెండు కేసుల్లో జగదీష్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడన్నారు. దీర్ఘకాలంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడుతుండటంతో ఇతనిపై పిడి యాక్ట్ నమోదు చేసి శుక్రవారం హైదరాబాద్‌లోని చెంచల్‌గూడ సెంట్రల్ జైలుకి తరలించినట్లు తెలిపారు.

## ఉద్యోగుల డిమాండ్ల సాధనకు నిరసన



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు తమ డిమాండ్లు సాధన కొరకు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని, పిఆర్‌సి రిపోర్టు తెప్పించి జూన్ రెండు లోపు అమలు చేయాలని ఉద్యోగుల పెన్షనర్ల కార్డులు మంజూరు చేయాలని, రాష్ట్రంలో సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాకాల రమేష్, విజయ్ కుమార్, సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు పూర్ణ , ఎన్‌ఎస్పి సర్కిల్ ఎస్సీఈ కార్యాలయ ఉద్యోగులు నవీన్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే పాయంను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ సంఘం నాయకులు



ప్రజాపక్షం/మణుగూరు: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని బీసీ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని బీసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ సమస్యలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బీసీ వర్గాల అభివృద్ధికి తగిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని రాజేష్ యాదవ్, పినపాక నియోజకవర్గ అధ్యక్షురాలు బింగి రమాదేవి, మణుగూరు మండల అధ్యక్షులు పెనుగొండ సాంబశివరావు, మణుగూరు టౌన్ ప్రెసిడెంట్ లవ కుమార్, పెనుగొండ రవి, జన్నెల నారాయణ, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నిత్యవసరాల ధరలను నియంత్రించాలి



ప్రజాపక్షం/సుజాతనగర్: రోజురోజుకు చాప కింద నీరులా పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని ఇప్పుడున్న వాటి ధరలను వెంటనే తగ్గించాలని మాదిగ ఐక్యవేదిక సుజాతనగర్ మండల అధ్యక్షులు వేల్పుల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచి నూనె, చింతపండు, కందిపప్పు, కారం, పసుపు, పిండి, దినుసులు తదితర సరుకుల ధరలు నిరంతరం పెరుగుతున్న పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, గతంతో పోలిస్తే ఇప్పుడు మూడు రెట్లు నిత్యవసరాల ద్వారా ప్రజల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నదని, దాని ద్వారా కుటుంబ పోషణ భారమై అప్పులు చేయవలసిన పరిస్థితి వస్తున్నదని, కాలం గడుస్తున్న కొద్దీ సరుకుల ధరలు అయితే పెరిగిపోతున్నాయి గాని సామాన్య ప్రజల ఆర్థిక స్థితి గతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నదని అన్నారు. పండించే రైతుకు సరైన గిట్టుబాటు ధర దక్కటం లేదు కానీ ఆ రైతు దగ్గర కొనుగోలు చేసే కార్పొరేట్ దందా దారులు వారు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయవలసి వస్తున్నదని ఆ భారం మరల ప్రజలపైనే పడుతున్నదని అన్నారు. ధరల పెరుగుదల అంత చిన్న విషయమేమీ కాదని ఇదో మరో ఉద్యమం కాకముందే స్పందించి నియంత్రించకపోతే ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వాలు గురికాక తప్పదన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసనకు భారీ స్పందన



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ కార్మికులు భారీగా హాజరయ్యారు. మండుటెండను లెక్కచేయకుండా పాల్గొన్న వారు పీఆర్‌సీ అమలు, రూ 13,000కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల, ఆరోగ్య కార్డులు, సీపీఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ వంటి డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ నాయకులు అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాయల వీరస్వామి, శీలం ఆంజనేయులు, మండవ నరసయ్య, బద్రు, ఎం సతీష్, సిహెచ్ శ్రీనివాస్, యాకయ్య, పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: రాష్ట్ర టీజీఈజేఏసీ పిలుపు మేరకు సింగరేణి టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. రెండో పీఆర్‌సీ అమలు, రూ 13,000 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల, ఆరోగ్య కార్డులు, ఈహెచ్ఎస్ అమలు, సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణతో పాటు 64 పెండింగ్ సమస్యల పరిష్కారం కోరారు. ఈకార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్, ఎం హరీష్, బి శ్రీనివాసరావు, వి మంగీలాల్, శంకర్, బి మంగ్య, డి రమేష్, బి బాలాజీ, అజ్మీరా బస్సీలాల్, అజ్మీరా వీరునాయక్, రాంకోటి, ఎం రమేష్, రాములు, నెహ్రూ, హరి, బంపర్, పాషా, రమేష్, ప్రకాష్, నరసింహరావు, చంద్రశేఖర్, నరేంద్రర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే పాయంకి వినతి



ప్రజాపక్షం/మణుగూరు: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ గృహ నిర్మాణాల కోసం అలాగే గ్రామంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం కొరకు, ఆ గ్రామ సర్పంచ్ ఇర్ప కవిత నేతృత్వంలో ప్రతినిధులు శుక్రవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ నేలపట్ల సుధాకర్ రెడ్డి, ఎస్.డి. అబ్జర్ కూడా పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం సహకారం అందించాలని వారు కోరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రేషన్ కోసం ఎదురుచూపులు




**-ఈనెలలో రెండే రోజులు రేషన్ విక్రయం**

**-ఇన్చార్జి డీలర్‌తో ఇబ్బందులు**

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండల కేంద్రంలో గల నిత్యవసర వస్తువుల విక్రయశాల(జీసీసీ)వద్ద రేషన్ కోసం ప్రజలు ఎదురుచూపులు చేస్తున్నారు. జిసిసి కేంద్రంలో పని చేస్తున్న డీలర్ రిటైర్డ్ కావడంతో ఇంచార్జ్ డీలర్ ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఇన్చార్జి డీలర్ ఒకరోజు వస్తే ఒక రోజు రారు ఈనెలలో ఫస్ట్ తారీకు నుండి మంగళవారం వరకు కనీసం రెండు రోజులు మాత్రమే రేషన్ విక్రయించడంతో ప్రజలు పనులు మొత్తం వదులుకొని రేషన్ షాప్ చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం ఉదయం 9గంటల నుండి ఎదురుచూస్తున్న చివరికి రాలేదు. చరవాణి ద్వారా సంప్రదిస్తే చరవాణి అతని భార్య దగ్గర ఉండటంతో అతని భార్య మా భర్త ఈ రోజు రావడం లేదని తంబు పెట్టడానికి ఇల్లందు వెళ్ళాడని చెప్పారు. ఇన్చార్జి డీలర్ కి రెండు షాపులు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో మండల హెడ్‌క్వార్టర్ జీసీసీ పెద్దది చాలా మంది జనాభా కలిగినటు వంటి ప్రాంతం. రెగ్యులర్ డీలర్ లేకపోవడంతో నాన్న అవస్థలు ప్రజలు పడుతున్నారు. జీసీసీ కేంద్రం ఊరికి దూరంగా ఉండటంతో ఎండలో ఇక్కడ దాకా వచ్చి తీరా చూస్తే డీలర్ లేకపోవడంతో విసిగిపోయి వచ్చిన ప్రజలు విసిగించుకుంటున్నారు. అసలే మూడు నెలల రేషన్ రేపటితో 15 తారీకు ఆన్లైన్ డేట్ అయిపోతే మాపని అంతే మా రేషన్ పోయినట్టే అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మా బాధలు పట్టించుకోని ఆళ్లపల్లి జీసీసీ కేంద్రానికి రెగ్యులర్ డీలర్‌ని నియమించాలని, ఉన్న డీలర్‌తో రెగ్యులర్‌గా వచ్చేటట్టు చూడాలని, ఈనెల 30వ తారీకు వరకు రేషన్ ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**చరవాణిలో గిర్దావర్ రామయ్య వివరణ కోరగా....**

రెగ్యులర్ డీలర్ లేక ఇన్చార్జి డీలర్‌తో రెండు షాపులు చూసుకోవడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. దీన్ని సవరిస్తామని అన్నారు.

## నాణ్యమైన విద్యకు మరోమెట్టు

**ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా లభించడం సంస్థకు గర్వకారణమని కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. ఈ హోదా కళాశాల విద్యా ప్రమాణాలకు వచ్చిన గొప్ప గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు.

**ప్రశ్న :** మీ కాలేజికి స్వయం ప్రతిపత్తిహోదా రావడం పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

**చైర్మన్ :** మా కాలేజికి స్వయం ప్రతిపత్తిహోదా రావడం ఎంతో గర్వకారణం. ఇది మా విద్యా ప్రమాణాలకు వచ్చిన గుర్తింపు. కాలేజీ అభివృద్ధిలో ఇది ఒక మైలురాయి అని భావిస్తున్నాం.

**ప్రశ్న :** ఈ హోదా సాధించడానికి కాలేజీ తీసుకున్న ముఖ్యమైన చర్యలు ఏమిటి?

**చైర్మన్ :** నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశోధన కార్యకలాపాలను బలోపేతం చేయడం ద్వారా ఈ హోదా సాధించగలిగాం.

**ప్రశ్న :** హోదా వల్ల విద్యార్థులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు ఏమిటి?

**చైర్మన్ :** విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించుకునే అవకాశం ఉంటుంది. కొత్తకోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించగలుగుతాం.

**ప్రశ్న :** ఈ హోదాతో విద్యా ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయని భావిస్తున్నారు?

**చైర్మన్ :** విద్యా విధానంలో స్వేచ్ఛ పెరగడంతో నూతన బోధనా పద్ధతులను అమలు చేయగలుగుతాం. ఇది విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుంది.

**ప్రశ్న :** కొత్త కోర్సులు లేదా? ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ప్రవేశపెట్టే ఆలోచనలు ఉన్నాయా?

**చైర్మన్ :** పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకొని కొత్త కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రవేశపెట్టాలని ప్రణాళిక రూపొందిస్తున్నాం.

**ప్రశ్న :** పరిశోధన, ఆవిష్కరణల విషయంలో కాలేజిలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**చైర్మన్ :** అధ్యాపకులు, విద్యార్థులను పరిశోధన కార్యక్రమాలలో ప్రోత్సహిస్తూ, ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేశాము. అవి విద్యార్థులకు ఎంతగానో దోహదపడబోతున్నాయి.

**ప్రశ్న :** చివరగా ఏమైన చెప్పాలనుకుంటున్నారా?

**చైర్మన్ :** విద్యార్థులకైనా తల్లిదండ్రులకు నేను ఒక్కటే చెప్పదలుచుకున్నాను. విద్య అనేది నాణ్యతతో పాటు స్కిల్స్ కలిగి ఉండాలి. అటువంటి విద్య మా కళాశాలలో నాణ్యత, స్కిల్స్, కల్చరల్ ఎక్టివిటీస్‌తో సమపాలుగా అందిస్తున్నాము. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను విద్యార్థులు అదిరోహించాలనే నా ఆకాంక్ష.

## మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులో కేంద్రం నీచరాజకీయం




ప్రజాపక్షం/ కొత్తగూడెం : మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సవరించాలని, అమలులో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కాలయాపన విధానం నీచమైన రాజకీయ కుట్ర అని జిల్లా భారతజాతీయమహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి విమర్శించారు. పట్టణంలోని రామాటాకీస్ రోడ్‌లో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లులోని అభ్యంతరకర అంశాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ కుమారి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ మహిళా రిజర్వేషన్లును జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టి దాని అమలును ప్రశ్నార్థకంగా మార్చిందని మండిపడ్డారు. 1960వ దశకంలో గీతాముఖర్జీ వంటి కమ్యూనిస్టు యోధులు చేసిన పోరాటా ఫలితమే ఈ రిజర్వేషన్లు అని, కానీ నేడు ప్రభుత్వం తన రాజకీయ ఎజెండా కోసం పార్లమెంటరీ నిబంధనలను తారుమారు చేస్తూ మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. జనాభా నియంత్రణ మహిళా సంక్షేమంలో మెరుగ్గా ఉన్న రాష్ట్రాలపై వివక్ష చూపుతూ డీ లిమిటేషన్ పేరుతో మహిళా శక్తిని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, దీనిని ప్రజలు గుర్తించి ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఈసంశెట్టి పద్మ, మావిడాల ధనలక్ష్మీ, మునిగడప పద్మ, సత్తెనపల్లి విజయలక్ష్మీ, పైడిపెల్లి లక్ష్మీ, షేక్ షాహీన్, కైసర్, రమాదేవి, షహీమ్,లత పాల్గొన్నారు.

## ప్రాణరక్షణకు ముందడుగు అరైవ్ అలైవ్



ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్పీ రవీందర్‌రెడ్డి హాజరై, మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో సమయానికి స్పందించడం ఎంతో కీలకమని, సీపీఆర్ వంటి ప్రాణరక్షణ పద్ధతులు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం వైద్యురాలు సంకీర్తన మాట్లాడుతూ ప్రమాదాల తర్వాత తొలి పది నిమిషాలు ప్రాణరక్షణలో కీలకమని, సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ఈకార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయితీ సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆటో డ్రైవర్లు, పోలీసులు, పాల్గొన్నారు.

## కుమ్మరికుంట కన్నీటి కష్టాలు



**-మట్టి పాత్రలకు గిట్టుబాటు కరువు**

**-కుమ్మరుల బ్రతుకులు కూలీ కన్నా దారుణం**

**-కృత్రిమ మట్టిపాత్రలదాటికి విలవిల**

ప్రజాపక్షం/పినపాక: నల్లమన్నే వారి ఆస్తి అదే నేల తల్లి దీవెన..చేతులల్ల ఆడే మట్టే దైవం...జీవన మార్గం...మట్టే వారి ప్రపంచం. కుండలు, రంజన్లే వారి జీవితం. దినమంతా ఆ పనిలోనే...ఒంట్లో సత్తువంతా దానికే. ఇదంతా ఎందుకంటే మండు వేసవిలో నిండు కుండను ఇవ్వడానికి..ఎండల పడొచ్చినోళ్ల గొంతు తడపడానికి...కడుపు చల్లార్చడానికి...కానీ వారి బతుకులు మాత్రం చల్లగా లేదు. ఉన్నవన్నీ అమ్మి..కుండలు చేస్తే దక్కేది అంతంతే, దిన కూలీ కన్నా తక్కువే..అయినా వారు కుండలు చేస్తూ ఉంటారు. ఎందుకని అడిగితే ఇది మాకుల వృత్తి..ఇదే మా దైవంగా భావించే కుమ్మరింట కన్నీటి కష్టాలపై ప్రజాపక్షం అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఎండాకాలం వచ్చిందంటే ఏ ఇంటిలోనైనా చల్లటి నీళ్లను అందించే మట్టి నుండి తయారు చేసిన కుంట ఉండాల్సిందే..ఇదంతా నాణేనికి ఒక వైపేతే..ఆ కుండలను తయారు చేసే మట్టి మనుషుల(కుమ్మరి కులస్తుల)జీవన చక్రం అందుకు భిన్నం..మట్టి సేకరణ నుండి అందమైన ఆలోచనకు తగిన వస్తువుల తయారీ వరకు పడే తపన అంతా..ఇంతా కాదు. రెడీమేడ్ భూతం వీరి ఉపాధికి గండికొట్టింది. తాము తయారు చేసిన వస్తువులు, అమ్ముడుపోక ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్నారు. తయారీ అంత సులువేం కాదు..రంజన్ల తయారీకి నల్లమట్టి, గుర్రంలద్ది, చెక్కపొట్లు, ఎర్రమట్టి, వాహనాల పాత టైర్లు వినియోగిస్తారు. ముందుగా నల్లమట్టిని కొట్టి ఎండపెట్టాలి. ఆ తరువాత బాగా తడపాలి. మెత్తగా అయ్యాక దాంట్లో గుర్రంలద్ది వేసి కలుపుతారు. దాంతోపాటు బూడిద కూడ వేస్తారు. వీటిని కలపడం ద్వారా మట్టి వరగకుండా ఉంటుంది. మట్టిని సులువుగా ఏ వైపంటే ఆ వైపు మలుగుతుంది. చెక్కలతో కొట్టి గుండ్రని ఆకారంగా రంజన్లు తయారు చేస్తారు. అది పూర్తయిన తరువాత బట్టిల్లో పెట్టీ కాలుస్తారు.

**కుమ్మరుల బ్రతుకులు కూలీకన్నా దారుణం....**

కమ్మరులు ఒక కుండ, దుత్త, కుండీ, ప్రమిద తయారు చేయాలంటే పడే కష్టం అంతా ఇంతాకాదు. కిలోమీటర్ల దూరం వెళ్లి బంక మట్టి, ఎర్రమట్టిని తీసుకువచ్చి నానబెడతారు. మట్టిముద్దలా చేస్తారు. అనంతరం బండిచక్రం లాంటి దానిపై వేసి తమకు కావాల్సినరీతిలో చేతితో మలుచుకుంటారు. సారె తిప్పుతూ కుండలు, దుత్తలు, కుండీలు, ప్రమిదల ఆకృతిని తీర్చిదిద్దుతారు. వాటిని ఎండబెట్టిన వారం రోజులకు బట్టీల్లో కాలుస్తారు. మట్టిని పాత్రగా మలిచే క్రమంలో వారి కష్టాలు వర్ణణాతీతం.

**ప్లాస్టిక్‌కు వేలు పెడతారు.. మా దగ్గర బేరాలు ఆడతారు...**

మేము ఎండనక, వాననక రోడ్డు పక్కన కూర్చుని అమ్ముతుంటాం కానీ జనం మాత్రం కుండల రేట్లు అడిగి వెళ్లిపోతున్నారు తప్ప కొనడం లేదు. వంద రూపాయల కుండను యాభైకి అడుగుతునన్నారు. ప్లాస్టిక్ డబ్బాలకు, స్టీల్ గిన్నెలకు వేల రూపాయల ఖర్చు చేస్తారు కానీ పేదోళ్లం మా దగ్గర మాత్రం బేరాలు ఆడతారు. వేసవి కాలం తప్ప మిగతా రోజుల్లో బోణీ కూడా అవ్వదు. తయారు చేసిన సరుకు అమ్ముడు పోక, పగిలిపోతే నష్టమే మిగులుతుంది.

**జల్లారపు నరేష్, ఏడూళ్లబయ్యారం గ్రామం**

## తెలంగాణాను అవమానించిన బిజేపి ఎంపి క్షమాపణ చెప్పాలి

**- ఆత్మ గౌరవాన్ని పార్లమెంట్ సాక్షిగా అవమానించిన బిజేపి**

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాహుల్**



ప్రజాపక్షం/పాల్వంచ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ అవమానకర వ్యాఖ్యలు చేసిన బిజేపి ఎంపి తేజస్వి సూర్య వెంటనే తన మాటలను వెనక్కి తీసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాపక్షంతో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమర వీరుల ప్రాణత్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. ఎవరి దయా దాక్షిణ్యాలతో తెలంగాణ రాలేదని తెలంగాణ మా హక్కని శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో వేలాది మంది యువతీ యువకులు, సబ్బండ వర్గాలు పోరాటాలతో, బలిదానాలతో సాధించుకొన్న రాష్ట్రమన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో శ్రీకాంతాచారి, సిరిపురం యాకయ్య, కానిస్టేబుల్ క్రిష్టయ్య, భోజ్యా నాయక్, ప్రవీణ్ నాయక్ వంటి అనేక మందిఅమరుల త్యాగాలు ఈ నేల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. అలాంటి పవిత్ర పోరాటాన్ని భారత్, పాకిస్థాన్ విభజనతో పోల్చటం ఎంపి అవివేకానికి నిదర్శనమన్నారు. ఆయన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బదీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ పోరాట చరిత్ర తెలియకుండా మాట్లాడిన ఎంపి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నప్పటికి తెలంగాణ బిజేపి ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగా అంటే త్యాగం, పోరాటాలకు చిరునామా అని, తెలంగాణ అంటే స్వాభిమానానికి ప్రతీక అని, తెలంగాణ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవటానికి రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ సిద్ధగా ఉంటారని చెప్పారు.బిజేపి నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొనిరాష్ట్ర గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. ఇలాంటి సమయంలో మౌనంగా ఉండటం తెలంగాణ ప్రజల బావోద్వేగాలను అవమాన పరచడమేనన్నారు. బిజేపి పార్టీ నాయకులు పదే పదే తెలంగాణపై వ్యతిరేక భావజాలాన్ని వ్యక్తం చేస్తూ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బదీస్తున్నాయని ఆరోపించారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బిజేపి పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి ఎంపి తేజస్వీ సూర్యను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రధానోపాధ్యాయుడి ఆదర్శం



ప్రజాపక్షం/కూసుమంచి : కూసుమంచి మండల పరిధిలోని ఎంపీపీఎస్ పూరియతండా పాఠశాలలో నూతన గేటు, పాఠశాల నేమ్ బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ లక్ష్మీ నారాయణ తన సొంత నిధుల నుండి రూ 38వేల వ్యయం చేసి గేటు, నేమ్ బోర్డు ఏర్పాటు చేయించడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల భద్రత, పాఠశాల అభివృద్ధి పట్ల ఆయన నిబద్ధతకు ఇది నిదర్శకంగా నిలిచింది. ఈ గేటు, నేమ్ బోర్డును మండల విద్యాధికారి ఆర్ వీరస్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా పాల్గొన్న వారు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ సేవలను అభినందిస్తూ, ఆయన చర్య ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిసర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం నాగేశ్వరరావు, కె అనంతు, శ్రీనివాస్ గౌడ్, రాంబద్రం, సలీమా, కోటచారి, సిఆర్పి జాఫర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్యాలయంలో ఏసిబి విచారణ



ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఏసిబి అధికారులు కార్యాలయంలో పలువురు సిబ్బందిని సుమారు గంట సేపు విచారణ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖమ్మం ఏసిబి సిఐ డి. బాలాజీ మాట్లాడుతూ గతంలో పాల్వంచ మునిసిపల్ కార్యాలయంలో ఏసిబి డిఎస్పి రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కొనసాగింపుగా విచారణ చేశామన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఈ తనిఖీలో ఏసిబి కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకర పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నెలకొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరెగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ 2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణపై మత్స్యశాఖ డీడీ విచారణ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం చెరువు ఆక్రమణ పై రాష్ట్ర మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ క్షేత్ర స్థాయిలో శుక్రవారం విచారణ చేపట్టారు. చెరువు విస్తీరణం ఎంత ఎన్ని ఎకరాలు ఆక్రమణ కు గురైంది. ప్రస్తుతం ఉన్న చెరువు ఎంత, చెరువు ఎఫ్ఏఎల్ ఇతరత్రా వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆక్రమణ చెర నుంచి స్వాధీనం చేసుకుని సొసైటీ కి అప్పగించాలని ఉన్నతాధికారులను కోరారు. ఆక్రమణ కు సంబంధించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారి శివప్రసాద్, చెరువుమాధారం మత్స్యసొసైటీ అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్స్ బలరాం, శేషయ్య లు ఉన్నారు.

## గడ్డం బక్కయ్యకు ఘన నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం)సీనియర్ నాయకుడు గడ్డం బక్కయ్య మృతిపై పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. అనారోగ్యంతో మరణించిన బక్కయ్య మృతదేహాన్ని శుక్రవారం సందర్శించి పార్టీ పతకాన్ని కప్పి సంతాపం తెలిపారు. మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సీపీఐ(ఎం)ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ బక్కయ్య మార్కిస్టు సిద్ధాంతంపై అచంచల విశ్వాసంతో చివరి వరకు పార్టీ కోసం పని చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, రేపాకుల శ్రీనివాసరావు, ఎస్ఏ నబి, ఆలేటి కిరణ్, మండల నాయకులు దాసరి మల్లయ్య, తేజావత్ చందర్, దాసరి సైదులు, పచ్చిపాల నరసింహారావు, పచ్చిపాల యాకేశ్వరరావు, సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మీ రాజు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పచ్చిపాల సోమయ్య, రెడ్డెబోయిన జగ్గయ్య, గడ్డం విశ్వనాథం, బోడ రవి, కొమ్ము వెంకన్న, గుంపెనపల్లి నాగేశ్వరరావు, మోరపాక శ్రీను, ఎల్లబోయిన రామారావు, వెంకట్, శ్రీను, సెట్ రాం, కొమరయ్య, యశోదమ్మ, సరమ్మ, ధనమ్మ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి వినతి

ప్రజాపక్షం/అశ్వాపురం:అశ్వాపురం మండలంలో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల డిప్యూటీ తహసీల్దార్ మైపా రాజేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా టీఎన్జీవో జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. టీఎస్ యూటిఎఫ్ ప్రెసిడెంట్ సీతారామయ్య మాట్లాడుతూ తెలంగాణ రెండవ పీఆర్‌సీ బెనిఫిట్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను త్వరగా అమలు చేసి, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని నాయకులు సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల నాయకులు పాయం కృష్ణయ్య, అంజయ్య, జిల్లా బాధ్యులు బీ రాము, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులుఏ బీ నాగులు, ఉపాధ్యక్షులు బి కిషోర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, సలేందర్ సింగ్, శంతన్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ టెస్టులతో..

# విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందుతుంది





-మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు
-ఒత్తిడిని తట్టుకుని విజయాలను సాధించాలి
-ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్
-ఏఐఎస్ఎఫ్ మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష విజయవంతం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మోడల్ టెస్టుల ద్వారా విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెరుగుతుందని, విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని విజయం సాధించాలని ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో డాక్టర్స్ అకాడమీలో మోడల్ నీట్, ఇంజనీరింగ్ ప్రశ్నాపత్రాలను వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కలుగుతుందని, మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా మోడల్ ఎంసెట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇట్టి మోడల్ పరీక్ష ఇంజనీరింగ్, మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మోడల్ పరీక్షల వల్ల సమయం వృథాకాకుండా ఎలా పరీక్ష రాయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ఒక అవగాహన కలుగుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావిశివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ఒత్తిడిని తట్టుకుని విజయాలను సాధించాలన్నారు. సమాజంలో పోటీ పెరుగుతుందని దానికి తగినట్లు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రో॥ సదానందం, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సమితి సభ్యులు తోట రామాంజనేయులు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, జిల్లా నాయకులు గోపి, పవన్, వెంకటేష్, చైతన్య, నరేందర్, బన్ను, నాగేశ్వరరావు, ఉమామహేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డు నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షులు దీపక్ చౌదరి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ 46వ డివిజన్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం పక్క నుంచి గాంధీచౌక్ వరకు చేరుకునేవిధంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే ప్రయాణ దూరం తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందన్నారు. ఇప్పుడున్న రోడ్డు చాలా ఇరుకుగా ఉండి జన వాసాల మధ్య పోవడంతో పాటు స్వర్ణ భారతి కళ్యాణ మండపం వద్ద రోడ్డు ఇరుకుగా ఉండి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇట్టి విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, ఏఎంసి డైరెక్టర్ బోజడ్ల సత్యనారాయణ, ఐఎన్‌టియుసి నగర అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, ఓబిసి సెల్ అధ్యక్షులు బానాల లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొణిజర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొర్లపాటి సురేష్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్ల మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ ఎన్నిక శుక్రవారం కొణిజర్లలో జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తనికెళ్లగ్రామానికి చెందిన కొర్లపాటి సురేష్ (ఆంధ్రజ్యోతి), ప్రధానక్యాదర్శిగా చిన్నగోపతి గ్రామానికి చెందిన పగడాల మధు (సూర్య) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పాపగంటి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ముత్తనబోయిన శ్రీను, కోశాధికారిగా అనంతోజు చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులుగా మోటపోతులు బాబూరావు, యాసా నరసింహారావు, కార్యవర్గ సబ్యులుగా తుమ్మలపల్లి మంగపతిరావు, షేక్ నాగుల్‌మీరా, కవిడ రాము, ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతు మండలంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల సాధనకు కృషిచేస్తామని తెలిపారు.

## చేతి పంపులకు మరమ్మతులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని కోయచలక గ్రామంలో చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించారు. శుక్రవారం వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు చేతి పంపులకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బలుసుపాటి శేషయ్య, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావులు మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడిని నివారించేందుకు గ్రామంలోని 15 చేతి పంపులకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు టిజిఈజేఏసి రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. పిఆర్‌సిని ప్రకటించి వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ డిఏలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్యకార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్వేతకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల జేఏసి నాయకులు సుధాకర్‌రెడ్డి, మురళీధర్, కె. ఉమాశంకర్, అజ్మీర సోమ్లా, గుర్రం కేశవరావు, ఎన్. సురేష్‌కుమార్, ఎం. నాగిరెడ్డి, రమేష్, ఎ.కిరణ్‌కుమార్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పలువురి లబ్ధిదారులకు శుక్రవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవతో 39మందిలబ్ధిదారులకు మంజూరైన రూ.7.1లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటనర్సయ్య, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు అశ్విని, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, షేక్.ఇస్మాయిల్, మల్లెల లక్ష్మ ణరావు, కడియం శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీను, యేసు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో వికసించిన విద్యాకుసుమం రుచిత



**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం :** ఇటివల విడుదలైన ఇంటర్ పలితాలలో ఖమ్మం నగరంలోని విష్నుప్రియా నగర్ చెందిన దోడ్డపునేని నరసింహరావు కుమార్తె రుచిత యంపిసీ విభాగంలో 470 మార్కులకు గాను 467 మార్కులు సాదించి రాష్ట్ర స్తాయిలో 3 వ ర్యాంకు సాదించింది.చదువుపై అసక్తి, క్రమ శిక్షణతో రుచిత మంచి మార్కులు సాదించి అందరి మన్ననలను పోందింది. కృషి ఉంటే విజయం తద్యమని అమె ఋజువు చేసింది.రుచిత తండ్రి నరసింహరావు మిషన్ భగీరధ డీపార్టుమెంట్ లో డీఈ గా పనిచేస్తున్నారు.అత్యదిక మార్కులు సాదించి రాష్ట్ర స్తాయిలో మూడవ ర్యాంకు సాదించిన రుచిత ను పలువురు అబినందించారు.

## మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.9కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణాభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి, సందరీకరణ పనులు కోసం రూ.9కోట్లు మంజూరు చేయడం జరిగింది. వైరా నది కరకట్ట పక్కన ఈ ప్రాజెక్టు అమలు ద్వారా మధిర పట్టణానికి కొత్త అందం రావడంతో ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారింది. మధిర అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తున్న భట్టివిక్రమార్కకి మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం కృతజ్ఞతలు తెలిపారు.

## త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన త్రివేణి పాఠశాల విద్యార్థులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు మోహక్ ముస్కాన్, సాకేత్ రామ్, లాస్య, చంద్రసిద్దార్థ్ లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. శుక్రవారం ఆర్టివో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమజోహరా చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ పాఠశాల ఎప్పుడు ముందుంటుందన్నారు. ఇలాంటి ప్రోత్సహకాలు విద్యార్థుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. విజేతలైన విద్యార్థులను డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా తదితరులు అభినందించారు.

## అభివృద్ధి ప్రణాళిక కార్యాచరణపై సమీక్ష



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధి దెందుకూరు గ్రామంలోని శ్రీరస్తు కళ్యాణ మండపంలో తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు ఆధ్వర్యంలో ఎంపిడిఓ బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండలంలోని రూరల్ పరిధిలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలనుద్దేశించి ప్రభుత్వశాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించి ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రజాపాలన 99రోజుల కార్యచరణలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు కూడా నిర్వహించి రోడ్డు ప్రమాదాలను అరికట్టే విధంగా సురక్ష ప్రయాణాలు చేసే విధంగా రోడ్డు ప్రయాణ ప్రమాదాలను పాటిస్తూ ప్రతిఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరిస్తామని సిఐ మధు సమక్షంలో రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, పోలీస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బుక్ ఎగ్జిబిషన్



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బుక్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు వివిధ విభాగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని అందించేందుకు ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ముందుగా పుస్తక ప్రదర్శను ప్రారంభించి మాట్లాడుతూ పుస్తకాల ప్రాముఖ్యతపై వివరించారు. పుస్తకాలు మనకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయని ఆయన తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ బుక్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు అవసరమైన పుస్తకాలపై ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ ఎస్.ఇందిర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.సుజాత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**-లబ్ధిదారులతో సమీక్షలో ఎంపీడీఓ జమలారెడ్డి**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. శుక్రవారం సోంపల్లి గ్రామ పంచాయితీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నందు ఎంపీడీవో జమలారెడ్డి సమీక్ష నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల పనులనను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఆలస్యం జరగకుండా అధికారులు, లబ్ధిదారులు సమన్వయంతో పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ పంచాయితీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ, చలివేంద్రాన్ని ఎంపీడీవో స్వయంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సోంపల్లి సర్పంచ్ తాటి లక్ష్మి, ఉప సర్పంచ్ పండగ సౌజన్య, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, పంచాయితీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.





# నివాసగృహాలే దొంగలకు టార్గెట్

- ఎనిమిది తులాల బంగారం లక్ష రూపాయల నగదు అపహరణ
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న మండల ప్రజలు
- పోలీస్ స్టేషన్‌కి మూడు కిలోమీటర్ల దూరంలో భారీ చోరీ







**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** కిరాణం షాపు నిర్వహించుకుంటూ కడుపు మాడుచుకొని కష్టం చేసి రూపాయి రూపాయి పోగేసి కష్టపడి బంగారాన్ని నగదును కూడబెట్టుకున్న ఓ కిరాణా షాప్ యజమాని ఆశలు ఒక్క రాత్రికి అడియాసలు అయ్యాయి. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన మల్లెబోయిన యాదగిరి నివాసంలో ఎవరు లేని రాత్రి సమయంలో దొంగలు రెచ్చిపోయారు. బాధితులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిండిప్రోలు గ్రామానికి చెందిన మల్లెబోయిన యాదగిరి సతీమణి కరుణశ్రీ తమ దూరపు బంధువు మృతి చెందగా గురువారం ఉదయం వెళ్ళగా అది గమనించిన దొంగల ముఠా రాత్రి సమయంలో తమ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు దిశ మార్చి గడ్డపారలతో తలుపులను తెరచి బీరువాలో ఉన్న సుమారు 8 తులాల బంగారం లక్ష రూపాయల నగదు ఐదువేల రూపాయల చిల్లర పైసలు లను చోరీ చేసి పరారయ్యారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంటి యజమాని వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండటం ఇంట్లోనే బీరువా తలుపులు బీరువాలోని బట్టలు చల్లా చేదురుగా పడవేసి ఉండటం గమనించిన ఇంటి యజమానులు తమ బంగారు ఆభరణాలను చూసుకోగా బీరువాలో కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్ ని ఆశ్రయించారు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని పోలీస్ పై అధికారులకు సమాచారం ఇవ్వగా క్లోజ్ టీం వచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించి పలు ఆధారాలను నమోదు చేసుకున్నారు. వరుస దొంగతనాలతో తిరుమలాయపాలెం మండలంలో ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారు. గడిచిన రెండు సంవత్సరాల్లో ఎన్నో దొంగతనాలు జరిగాయి ఇంతవరకు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలను గుర్తించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. రాత్రి సమయాలలో పెట్రోలింగ్ నిర్వహించకపోవడం దొంగల ముఠాలు రెచ్చిపోతున్నారు. దొంగతనం జరిగిన తర్వాత పోలీసులు వచ్చి హడావుడి చేయడం తప్ప పక్క ప్రణాళికతో దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్న సందన పోలీసుల తీరు ఉందని ప్రజల అభిప్రాయపడుతున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొండబాల బాబురావు తన వ్యవసాయ క్షేత్రంలో ఉండగా గుర్తుతెలియని దుండగులు కత్తితో బెదిరించి సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఉంగరం లాక్కొని పోయిన సంఘటన జరగగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ గొలుసును ఉంగరాన్ని దొంగిలించిన దొంగలను గుర్తించి బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు చూపించారని బాధితుడికి ఆ బంగారు ఆభరణాలు ఇవ్వలేదని కొండబాల బాబురావు ఆరోపిస్తున్నాడు. దొంగలించిన దుండగులు సూర్యాపేట నగరంలో గోల్డ్ షాప్ లో అమ్మినట్టు ఆ గోల్డ్ షాప్ యజమాని ఐపీ పెట్టినట్టు చెబుతూ పోలీసులు చేతులు దులుపుకున్నారని కొండబాల బాబురావు తెలుపుతున్నాడు. ఆ దొంగలను గుర్తించిన పోలీసులు తన బంగారు ఆభరణాలు ఇప్పించాలని బాధితుడు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పటికైనా రాత్రి సమయాలలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తే దొంగతనాల్ని అరికట్టొచ్చని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. బంగారు ఆభరణాలు నగదు పోయిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మేయర్



**ప్రజాపక్షం/పాల్వంచ:** సుదూరం నుండి పట్టణానికి వివిధ పనుల నిమిత్తం ప్రయాణీకుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అబినందనీయమని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి 8వ, డివిజన్‌లో శ్రీ కనకదుర్గ క్యాస్టింగ్ మరియు ఇంజనీరింగ్ వర్క్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారితో కలిసి ప్రారంభించారు. వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చటానికి తన వంతుగా కృషి చేస్తూ ముందుకు వచ్చిన కనకదుర్గ ఇంజనీరింగ్ వర్క్స్ యాజమాని లింగమర్ల క్రిష్ణారావును అభినంధించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇదే విధంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ కే. సుజాత, లింగమర్ల సతీష్ కుమార్, షేక్ అజీజ్, గౌతమి క్రిష్ణ, కనగాల అనంతరాములు, అబ్దుల్ ఘని, పేటేటి నరేష్, స్థానిక కార్పోరేటర్లు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామ పంచాయితీకి చెందిన సర్పంచ్ సింధూజ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరిక కార్యక్రమం మణుగూరు ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో జరిగింది. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. గ్రామస్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నాయకులు పార్టీని బలపరిచే దిశగా ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. కాంగ్రెస్ పార్టీ శక్తివంతం కావడానికి స్థానిక నాయకులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటూరి రవీందర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కోర్స ఆనంద్, గౌరారపు హరీష్, కొప్పుల రామనాథం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిద్రమత్తులో చెట్టును ఢీకొట్టిన ఆటో



**ప్రజాపక్షం/కరకగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన వారు మేడారం దైవదర్శనానికి ఆటోలో 8 మంది ప్రయాణికులు బయలుదేరారు. తెల్లవారు గంటల సమయంలో వెళ్తున్న క్రమంలో ములుగు జిల్లా వీరాపురం గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి చెట్టుకి చెట్టుకు ఢీకొనటంతో ఇరువురికి గాయాలపాలయ్యారు. వీరిలో సోడె నాగరాజుకు కుడి కాలు ఇరుగగా, దీపిక అనే మహిళకు ఎడమ చెయ్యికి బోన్ ఫ్యాక్చర్ కావడం జరిగింది. వీరిని 108 సహకారంతో కరకగూడెం, పినపాక 108 వాహన లలో మణుగూరు ఏరియా హాస్పిటల్ కి తీసుకెళ్లినట్లు 108 ఈఎంటి పుల్లయ్య తెలిపారు.

## పశువులకు గాలికుంటు టీకాలు..



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని రాజుపేట బజారు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేయడం జరిగింది. మార్చి నెల పదో తారీకు నుండి నేటి వరకు ఇప్పటికీ 23 ఆవులు, 150 గేదెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు వెటర్నరీ అధికారి ఎండి హమీద్ పాషా తెలిపారు. గ్రామంలోని పశువుల యజమానుల సహకారంతో ఈ టీకాల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వెటర్నరీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశువులకు ఉచితంగా టీకాలు అందించారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి అత్యంత అంటువ్యాధిగా ఉండి పాల ఉత్పత్తి తగ్గడం, పశువులు బలహీనపడటం వంటి సమస్యలు తలెత్తుతాయని అధికారులు తెలిపారు. రైతులు తప్పని సరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎల్ఎసి శ్రీనివాసరావు, గోపాలమిత్రాలు భాస్కర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై రమాదేవి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** గత వారం రోజుల నుంచి సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామంలో ఒక గుర్తు తెలియని 60 సంవత్సరాల వయస్సు గల మగ వ్యక్తి తెల్లటి మీసాలు, గడ్డం కలిగి ఉండి తెలుపు రంగు పైజామా మరియు ఆకుపచ్చని రంగు హాఫ్ ఫాంట్ వేసుకొని తిరుగుతూ కనిపించగా శుక్రవారం సుజాతనగర్ ఎస్సై రమాదేవి తన సిబ్బంది తో అట్టి వ్యక్తిని వివరాలు అడగగా అతని పేరు తుమ్మ భాస్కరరావు గాను, అతనిది కోనాయిపాలెం గ్రామం నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ చెప్పడం జరిగింది. ఈ వ్యక్తి ప్రస్తుతం మతిస్థిమితం సరిగా లేని వ్యక్తిగా కనిపిస్తున్నాడు. ఇట్టి వ్యక్తి గురించి నందిగామ దగ్గర ఉన్న కొనాయిపాలెం గ్రామంలో విచారించగా ఈ వ్యక్తి ఆ గ్రామానికి చెందినవాడు కాదని తెలిసింది. అనంతరం ఆ వ్యక్తిని సుజాతనగర్ ఎస్సై పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి అతనికి కొత్త దుస్తులు కొనిపెట్టి అతని సంరక్షణ కోసం అతనిని ఖమ్మం కు చెందిన అన్నం ఫౌండేషన్ వారికి అప్పగించడం జరిగింది. ఇట్టి వ్యక్తి గురించి ఎవరికైనా ఏమైనా వివరాలు తెలిసినట్లయితే సుజాతనగర్ పోలీసు వారికి సమాచారం ఇవ్వవలసిందిగా సుజాతనగర్ ఎస్సై రమాదేవి కోరారు.

## 22 గొర్రెలు ఎత్తుకెళ్లిన దొంగలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దొంగలు మండలం లో బరితెగిస్తున్నారు. సినిమా పక్కీలో గొర్రెలను మంద నుంచి రూ.2 లక్షల విలువైన గొర్రెలను ఎత్తుకెళ్లారు...నలుగురు దొంగల ను వెంబడించగా ముగ్గురు పరారయ్యారు. వారిలో ఒక దొంగ ను పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి శివారు లో గొర్రెల మంద పై దొంగలు చోరీ చేశారు. మహబూబునగర్ కు చెందిన గడ్డం లక్ష్మయ్య . అనే రైతు ఆయనతో పాటు మరో ఇద్దరు రైతులు మొత్తం దాదాపు 500 గొర్రెల మంద ను గత వారం రోజుల క్రితం గ్రామంలోకి తీసుకొచ్చారు. నలుగురు దొంగల లక్ష్మయ్య గొర్రెల మంద లో దాదాపు రూ.2 లక్షల విలువైన 22 గొర్రెలను డీసీఎం వ్యాన్ లోకి వెక్కించారు. గొర్రెల మంద ఆరిచి పరుగులు తీయటంతో వెంటనేలక్ష్మయ్య గట్టిగా అరవటంతో పక్కనే ఉన్న రైతులు మేల్కోని దొంగలను వెంబడించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల కు చెందిన దొంగ రైతుల పైనే దాడి చేసేందుకు యత్నించగా దేహశుద్ధి చేసి తాళ్లతో బంధించి పోలీసులకు అప్పగించారు. బాధితుడు లక్ష్మయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇస్కఫ్ ప్యాట్రన్ సభ్యుల ఎంపిక

**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ( ఇస్కఫ్ ) జిల్లా కమిటి ఆధ్వర్యంలో ముగ్గురు ప్యాట్రన్ సభ్యులను శుక్రవారం ఎన్నుకొన్నారు. ఈ సంధర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ 47వ, డివిజన్ సిపిఐ కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు ( జివిఆర్ ) ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు సూర్యదేవర రామ్మోహన రావు, రచయిత శీరంశెట్టి కాంతారావు, లెక్చరర్ పుట్టగుంట సీతా మహాలక్ష్మిలను ఎంపిక చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కే. నాగమణి, అధ్యక్షులుగా గౌతమి క్రిష్ణ, కార్యదర్శిగా జి. వెంకటేశ్వర్లు వీరితో పాటుగా మొత్తం 31 మందితో జిల్లా కౌన్సిల్, 11 మందితో ఆఫీస్ బేరర్లుగా ఎంపికయ్యారు.

# అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఐజి




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పోలీస్‌స్టేషన్‌ను మల్టీజోన్1 ఐజి ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి(ఐపిఎస్) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని అన్ని విభాగాలను ఆయన సవివరంగా పరిశీలించి పోలీస్ సిబ్బంది పనితీరు, సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. ముందుగా అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ప్రాంగణానికి చేరుకున్న ఐజిని స్థానిక సిఐ, ఎస్సైలు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఐజి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు విధానం, పాత కేసుల పరిష్కారం, సిసిటివి పర్యవేక్షణ వ్యవస్థ వంటి అంశాలను ఒక్కొక్కొటిగా సమీక్షించారు. అశ్వారావుపేట స్టేషన్‌లో నమోదైన వివిధ కేసుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకుని విచారణలు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వడం పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. అదే విధంగా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అశ్వారావుపేట స్టేషన్ పరిధిలోని రోడ్డు ప్రమాదాలపై ఆరా తీసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై తగిన సూచనలు, సలహాలిచ్చారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, అఖిల, దమ్మపేట ఎస్సై సాయికిషోర్, పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వార్డు ప్రజల ఆరోగ్యంపై వుండ్రు వరలక్ష్మి ప్రత్యేక దృష్టి

## ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం
## డాక్టర్ కాపా మురళీకృష్ణ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ప్రభుత్వ పాఠశాల నందు వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌బిఐ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ యువకురాలు ఉత్సాహవంతురాలు అయిన యంగ్ డైనమిక్ కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు వార్డుపై నిరంతరం ప్రత్యేక దృష్టితో సమస్యలతో పాటు వార్డు ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టడం అభినందనీయమని అన్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని వార్డులో తరచుగా ఏర్పాటు చేస్తూ ఉంటారు. ఈ శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. పరీక్షల అనంతరం ఏమైనా సమస్యలు ఉంటే డాక్టర్స్ సలహాలు ఇచ్చి ట్రీట్మెంట్ ఏ విధంగా తీసుకోవాలో చూపిస్తారని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఈసిజి షుగర్, బిపి తదితర పరీక్షలు నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వాకుండోత్ బిక్యా, తేజావత్ నాగేశ్వరరావు, యండ్ల పృధ్వీరాజ్, కృష్ణ, రాజు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ బాయి, నాగమణి, ఆశా వర్కర్ నవీన, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విజయ, భూషణ్, స్టాఫ్‌నర్స్ ప్రియాంక, నాగం యెయహి, ఫార్మసిస్ట్ అర్పిత, డ్రైవర్ ఉపేందర్, మెడికల్ సిబ్బంది స్కూల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.





# గోల్డెన్ అవర్‌లో వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడుదాం

## అడిషనల్ డిసిపి అడ్మిన్

**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్‌లో సరైన వైద్య సహాయం అందిస్తే బాధితుడి ప్రాణాన్ని కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అడిషనల్ డిసిపి అడ్మిన్ రామానుజం అన్నారు. అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమాన్ని వైరా మండలం తాటిపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డిసిపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం వంటి అత్యవసర సమయాల్లో బాధితుడికి దగ్గరగా ఉన్న వారు వెంటనే స్పందించి వైద్య సహాయం అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునని అన్నారు. అలా ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు నిలిపిన వారిని రాహ్‌వీర్‌లుగా గుర్తించి రూ.25వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తుందన్నారు. అదేవిధంగా ప్రమాదాలు జరిగిన చోటుకు రక్షించేందుకు వెళ్లే రహావీర్లకు కేసులు ఎదుర్కోవాల్సిన భయం లేదని స్పష్టం చేశారు. రహావీర్లకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. పోలీసు, ఇతర శాఖల నుంచి ఎలాంటి కేసులు ఉండవన్నారు. ప్రమాద సమయాల్లో ఆకస్మికంగా వచ్చే గుండెపోటు వచ్చినప్పుడు గుండె కొట్టుకోవడం ఆగిపోతే సకాలంలో సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చునని, ఇది ఛాతిపై ఒత్తిడి కలిగించడం ద్వారా రక్త ప్రసరణను కృత్రిమంగా పునరుద్ధరించే అత్యవసర ప్రక్రియని, సకాలంలో సిపిఆర్ చేస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్ ప్రథమ చికిత్స, అత్యవసర కాల్స్, పిఎం రహత్, నగదు ప్రోత్సాహం, సామాజిక బాధ్యత, గోల్డెన్ అవర్ రెస్పాన్స్ సమయం గురించి శిక్షన, అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞచేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై రామారావు, పిహెచ్‌సి డాక్టర్ పాల్గొన్నారు.






# అశ్వారావుపేట మండల సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం అశ్వారావుపేట మండల సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కాసాని గార్డెన్స్‌లో నిర్వహించిన సర్పంచ్‌ల సమగ్ర సమావేశంలో ఈ ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేశారు. సమావేశం ప్రారంభంలో గ్రామాభివృద్ధి, పంచాయతీ పరిపాలనలో ఎదరవుతున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న అవరోధాలు, సర్పంచ్‌లు ఎదురవుతున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా కన్నాయిగూడెం సర్పంచ్ గుజ్జు సంకూర్ రావు, ప్రధాన కార్యదర్శిగా రామన్నగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం నాగేశ్వారావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇతర బాధ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షులు గుజ్జు సంకుర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సంఘం కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సిబిఎస్‌ఇ ఫలితాల్లో బోనకల్ విద్యార్థి ప్రతిభ

**ప్రజాపక్షం/ బోనకల్ :** ఖమ్మం జిల్లా బోనకల్‌కు చెందిన కొణతాపల్లి పార్థసాయి అన్వేష్ సిబిఎస్‌ఇ పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చాడు. ఖమ్మంలోని హర్వెస్ట్ స్కూల్‌లో చదువుతున్న అన్వేష్ 500మార్కులకు గాను 467 మార్కులు సాధించాడు. అన్వేష్ తల్లిదండ్రులు కొణతాపల్లి నాగేశ్వరరావు, కృష్ణవేణి ఫలితాల అనంతరం ఆనందం వ్యక్తంచేశారు. అన్వేష్ అత్యంత ప్రతిభకనబర్చి విజయానికి కారణమైన స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులను వారితో బోనకల్ మండల ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా తోటి మిత్రులు, బంధువులతో కలిసి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.



# ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** ఉపాధ్యాయ, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిజిఇజెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బోనకల్ మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రత్నాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పిఆర్‌సిని వెంటనే 51శాతం ఫిట్మెంట్లో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, హెల్త్ స్కీమ్‌లను వెంటనే చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఐక్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# వరి కోత మిషన్ పల్టీ : డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలో శుక్రవారం ఉదయం వరి కోత యంత్రం బండి కుంట చెరువు కట్టపై వరి కోత కోసేందుకు వెళుతున్న సమయంలో పల్టీ కొట్టి ప్రమాదవశాత్తు చెరువులో పడటంతో డ్రైవర్ విష్ణు (22) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, కూలీలు పొలాలలకు వెళుతున్న సమయంలో చూసి సమాచారం అందుకున్న గ్రామస్తులు కూలీలు సహకారంతో బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వారి వెంట ఉన్న క్లీనర్ రాజకుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. వారిది తమిళనాడు రాష్ట్రం అని తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కల్లూరు ఎస్సై హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. భౌతిక దేహమును పెనుబల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



# మొక్కజొన్న రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మొక్కజొన్న ధాన్యం కొనుగోలు రైతులను ఇబ్బంది పెట్టొద్దని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న ధాన్యం కాటాలేసి ట్రాన్స్‌పోర్టు చేయడంలో నిర్లక్ష్యం చేయకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# అగ్ని ప్రమాదంపై అధికారులను సమన్వయం చేసిన కౌన్సిలర్ వరలక్ష్మి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు మేరీ ఇమిట్లెట్ పాఠశాల వద్ద ఆకతాయిలు చేసిన చిన్న తప్పిదంతో చెట్టుకు మంటలు అంటుకొని కాలుతున్న విషయాన్ని తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఫైర్ సిబ్బందిని విద్యుత్ అధికారులకు సమాచారం అందించి తక్షణమే అక్కడికి పిలిపించి చెట్టుకు ఆనుకున్న కరెంటు తీగలను చూసి విద్యుత్ సరఫరాలను నిలిపివేశారు. ఫైర్ సిబ్బంది మంటలు చుట్టుపక్కలకి వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకొని ఆర్పించారు. మున్సిపల్ జెసిబితో చెట్టును పక్కకు తొలగించారు. కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు అధికారులు అప్రమత్తంగా చేయడం వలన ఆ ప్రాంతంలో ఒక విధాలా ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టారని చుట్టుప్రక్కల వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లైన్ ఇన్స్‌పెక్టర్ జార్జ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఫైర్ ఫైటర్ కె.వీరభద్రరావు, వీరభద్రం, ఫైర్ సిబ్బంది అప్పారావు, రాంబాబు, ప్రకాశరావు, వరలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.



# మట్టి తోలకాలకు అనుమతి ఇవ్వండి

**ప్రజాపక్షం/కల్లూరు:** మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న సర్పంచులు ప్రభుత్వ పథకాలకు మట్టితోలకాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సర్పంచులు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. పొలాలలోని ఎత్తుపల్లాలను సవరించుకోవడానికి ఐకెపి గ్రామ సమైక్య భవన నిర్మాణాలు కు, మట్టి తోలకాలకు అనుమతిని ఇవ్వాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, లింగాల, పాయపూరు, చెన్నూరు, గోకారం, గ్రామాలకు చెందిన సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా పాయపూరు గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రీనివాసరావు శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనానికి నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలని అజయ్ యాదవ్ కు వినతి పత్రం అందించారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఈ విషయమై కలెక్టర్‌కు తెలియపరుస్తారని పేర్కొన్నారు.